
www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 30 మే 2024
5
అన్నమయ్య



ఆలయ పరిసరాలు ప్రశాంతతకు నిలయాలు

ప్రజాశక్తి - రాయచోటి : శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ తల్లి గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా భాసిల్లుతుందని ఉత్తర ప్రదేశ్ లోని హరిద్వార్‌కు చెందిన పీఠాధిపతి పరమ హంస్ బాబా బన్‌ఖండీ మహారాజ్, సాధు పుంగవుల బృందం పేర్కొన్నారు. మంగళవారం రాత్రి సాధు పుంగవులు సంబేపల్లె మండలంలోని (దేవరరాయి నల్లగంగమ్మ తల్లి సన్నిధికి చేరుకున్నారు. బుధవారం ఉదయం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు గావించారు. అమ్మ వారి భక్తులు ఆలయ విశిష్టతను, దేవరరాయి మహత్యాన్ని సాధుపుంగవులకు వివరించి , ఫల పుష్పములు సమర్పించి సత్కరించారు. ఈ సందర్భంగా పరమ హంస్ బాబా బన్‌ఖండీ మహారాజ్, సాధు పుంగవులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలన్నారు. దేవరరాయి నల్లగంగమ్మ తల్లి ఆలయం దిన దినాభివృద్ధి చెందుచుండడం హర్షణీయ మన్నారు. ఎంఎల్‌ఏ శ్రీకాంత్‌రెడ్డి కృషితో రూ.1.20 కోట్ల నిధులుతో ఆలయ విస్తరణ పనులు ముగింపు దశకు చేరుకుంటుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కర్త, ధర్మకర్తల మండలి చైర్మన్ మునగా మురళీ స్వామి, వివి ప్రతాప్ రెడ్డి, సర్పంచ్ అంచల రామచంద్ర, కొప్పల గంగిరెడ్డి, గడికోట చంద్రశేఖర్ రెడ్డి, గుండ్రే భువనేశ్వర్ రెడ్డి,తేజ స్కూల్ కరెస్పాండెంట్ విజయ్ కుమార్ రెడ్డి, డీలర్ పాలగిరి సుధీర్ రాజు పాల్గొన్నారు.

వామ్మో..జూన్..!




జూన్ వస్తోందంటే తల్లిదండ్రుల్లో వణుకు. ప్రాథమిక పాఠశాలల నుంచి ఇంటర్, డిగ్రీ కళాశాలలకు అకడమిక్ విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న సంగతి తెలిసిందే. పిల్లలకు ఫీజులు, హాస్టల్ ఖర్చులను తలుచుకుని తల్లిదండ్రులు వామ్మో... జూన్.. అంటూ ఆందోళన చెందుతుండడం పరిపాటిగా మారింది. ప్రభుత్వం ఫీజురియింబర్స్‌మెంట్, అమ్మఒడి పథకాల అమలు కంటితుడుపు చర్యగా మారింది. ఫీజురీయింబర్స్‌మెంట్ ఆలస్యమైతే విద్యా సంస్థల యాజమాన్యాలు ముందుగానే ఫీజులు చెల్లించాలనే పేరుతో విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా, హాస్టల్ ఫీజులు చెల్లిస్తేనే భోజనాలనే విధంగా వేధింపులకు గురిచేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు వసూలు చేస్తున్న ఫీజులకు, ఫీజురియింబర్స్‌మెంట్‌కు పొంతన లేకపోవడాన్ని గమనించాలి. సామాన్య కుటుంబాలకు పిల్లల చదువులు భారంగా మారాయి.

- ప్రయివేటు, కార్పొరేట్ ఫీజులపై ఆందోళన
- ఎల్‌కెజికి సైతం రూ.25 వేలకుపైనే ఖర్చు
- ఇంటర్, ఇంజినీరింగ్ విద్యకు రూ.3 లక్షలు
- ఫీజుల క్రమబద్ధీకరణ, చెల్లింపులపై నిఘా ఏదీ?
- దిక్కు తోచని స్థితిలో తల్లిదండ్రులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి కడప జిల్లాల్లో 2,200 ప్రభుత్వ పాఠశాలలు, 950 ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలలు పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 1,56,156 మంది, 950 ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో సుమారు 1.40 లక్షల మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లలో విద్య పూర్తిగా వ్యాపారంగా మారింది. ఫలితంగా లక్షలాది మంది విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుంచి లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఎల్‌కెజికి రూ.25 వేలకుపైగా చెల్లించాల్సిన దుస్థితి దాపురించింది. తరగతులు పెరుగుతున్నకొద్దీ భారం పెరుగుతూ వస్తోంది. 10వ తరగతి ప్రతి విద్యార్థికి రూ.90 వేల వరకు వసూలు చేస్తున్నారు. హాస్టల్ ఫీజులు, పుస్తకాలు, యూనిఫామ్స్ అదనం. ఇద్దరు పిల్లల ఫీజులను లెక్కిస్తే ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున రూ.రెండు లక్షల చొప్పున ముట్టచెప్పాల్సి వస్తోంది. తల్లిదండ్రులిద్దరూ ఏడాది పొడవునా ఖర్చు చేసినా ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజులకు అదనపు అప్పులు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు లేకపోవడంతో తల్లిదండ్రులు పిల్లలను ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లకు పంపిస్తున్న వైనం కనిపిస్తోంది. దీన్ని ఆసరా చేసుకున్న విద్యా సంస్థల యాజమాన్యాల దోపిడీకి అడ్డూ అదుపూ లేకుండా పోయింది.

ఇంటర్, డిగ్రీ, మేనేజ్‌మెంట్, ఫార్మాస్యూటికల్ చదువులు ఖరీదైన వ్యాపారంగా మారిపోయింది. నీట్, ఎంసెట్, జెఇఇ, జెఇఇ అడ్వాన్స్‌డ్ పోటీ పరీక్షలకు పెరిగిన ఆశల నేపథ్యంలో ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలలను ఆశ్రయించాల్సిన అనివార్యత ఏర్పడింది. కాంపిటీషన్ పరీక్షల్లో మెరుగైన ర్యాంకులు సాధిస్తేనే సీటు లభించే అవకాశం ఉంది. లేనిపక్షంలో యాజమాన్య కోటా కింద పెద్దఎత్తున లక్షలాది రూపాయలను ఫీజుల రూపంలో ముట్టచెప్పుకోవాల్సి వస్తోంది. డేస్కాలర్స్‌గా ప్రయివేటులో ఇంటర్ విద్య అభ్యసించడానికి ఏడాది లక్షలాది రూపాయలు చెల్లించాల్సి వస్తోంది. హాస్టల్‌లో చేరితే రూ.రెండు లక్షల నుంచి రూ.మూడు లక్షల వరకు చెల్లించాల్సి ఉంటోంది. ఇంటర్ విద్యను పూర్తి చేసి ఇంజినీరింగ్‌లో చేరితే హాస్టల్ ఫీజు రూ.60 నుంచి రూ.80 వేలకుపైగానే ఉంటోంది. ప్రభుత్వం ఇచ్చే ఫీజురియింబర్స్‌మెంట్ ట్యూషన్ ఫీజులకే సరిపోతోంది. మిగిలిన డబ్బులు చేతి నుంచి చెల్లించాల్సి వస్తోంది. ఇంజినీరింగ్ నాలుగేళ్ల కోర్సుకు అదనంగా రూ.నాలుగు లక్షలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఫీజు రియింబర్స్‌మెంట్ వర్తించని విద్యార్థులు ఏటా రూ.నాలుగు లక్షలు చొప్పున నాలుగేళ్లకు రూ.16 లక్షల వరకు చెల్లించాల్సి వస్తోంది. నీట్‌లో ఉచిత ఎంబిబిఎస్ సీటు సాధిస్తే రూ.రెండు లక్షల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఉచిత సీటు లభించకపోతే రూ.25 లక్షల నుంచి రూ.40 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. మేనేజ్‌మెంట్, ఫార్మసీ కోర్సులకు సైతం భారీగా వెచ్చించాలి. ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఊదరగొడుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి వేరుగా ఉందని సంగతి గ్రహించాలి. ప్రస్తుత విద్యా సంస్థల యాజమాన్యాల ధన దాహం సామాన్య కుటుంబాలకు భారంగా మారిందని చెప్పవచ్చు.



బెస్ట్ అవైలబుల్ పథకం కింద సామాన్య కుటుంబాలకు ఇస్తున్న ఉచిత విద్యను ప్రభుత్వం దూరం చేసింది. ఫలితంగా అణగారిన కుటుంబాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఫీజుల వసూళ్లపై ప్రభుత్వ పర్యవేక్షణ కొరవడడం, ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాల చెల్లింపులను నిఘా పరిధిలో చేర్చకపోవడంతో ఇష్టారాజ్యంగా మారింది. ప్రభుత్వం ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజులను క్రమబద్ధీకరించడం, ఫీజుల వసూళ్లపై నిఘా వేయడం, ఇన్‌కమ్‌ట్యాక్స్ దాడులు చేయడం వంటి చర్యలతో సామాన్యులను అప్పులఊబి నుంచి బయటపడే అవకాశం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

ఓట్ల లెక్కింపునకు పటిష్టమైన ఏర్పాట్లు

- జిల్లా ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి-రాయచోటి


సార్వత్రిక ఎన్నికలలో భాగంగా జూన్ 4న జరిగే కౌంటింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పటిష్టంగా పూర్తి చేస్తున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్ కిషోర్ కేంద్ర ఎన్నికల సంఘం డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్‌కు వివరించారు. బుధవారం న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్ నుంచి రాష్ట్రంలో కౌంటింగ్ సన్నద్ధతపై రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా, పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలు, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులతో కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ కుమార్ వ్యాస్ సమీక్ష నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని ఖచ్చితమైన ఫలితాల ప్రకటనకతో త్వరితగతిన పూర్తి చేయాలని, శాంతి భద్రతల పరిరక్షణకు నియోజకవర్గాల వారీగా ఇప్పటివరకు చేసిన ఏర్పాట్లను, తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకుని ఇంకను తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, ఎస్‌పి కృష్ణారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను ప్రణాళిక బద్ధంగా చేపట్టామని, కౌంటింగ్ కోసం అన్ని విధాలా సన్నద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఏడు సెగ్మెంట్లతో ఒక పార్లమెంట్ స్థానం ఉందన్నారు. ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంట్ సెగ్మెంట్లకు రాయచోటి జిల్లా కేంద్రంలో ఒకే లొకేషన్‌లో పటిష్టమైన భద్రతతో కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేశామని, పార్లమెంట్ పరిధిలోకి వచ్చే పుంగనూరు అసెంబ్లీ సెగ్మెంట్ కౌంటింగ్ చిత్తూరు జిల్లాలోనే జరుగుతుందని వివరించారు. కౌంటింగ్ కేంద్రంలో అసెంబ్లీ మరియు పార్లమెంట్ సెగ్మెంట్లకు 12 కౌంటింగ్ కేంద్రాలు, పార్లమెంట్ పోస్టల్ బ్యాలెట్‌కు విడిగా ఒక కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేసి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రంలో కమ్యూనికేషన్ రూము మీడియా ఫెసిలిటీషన్, బారికేడింగ్, ఇంటర్నెట్ సౌకర్యం తదితర ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కౌంటింగ్‌కు అన్ని విధాల సాఫీగా జరిగేందుకు చర్యలు తీసుకున్నామని, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ మధ్యాహ్నం రెండు గంటల లోపు, ఇవిఎం కౌంటింగ్‌ను సాయంత్రం నాలుగు గంటల లోపు, మొత్తం ఫలితాల ప్రకటనను రాత్రి 7 గంటల లోపు పూర్తి చేయడానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. ఏర్పాట్లపై అభ్యర్థులు, ఎలక్షన్ ఏజెంట్లతో సమావేశాలు నిర్వహించి పూర్తిగా తెలియజేశామన్నారు. ఎస్‌పి కృష్ణారావు మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కౌంటింగ్ నేపథ్యంలో ఎలాంటి అల్లర్లు, సంఘటనలు జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలింగ్ తర్వాత కూడా జిల్లాలో మొబైల్ పికెట్స్, మొబైల్ పార్టీలను, నైట్ పెట్రోలింగ్ ఏర్పాటు చేశామని, గుర్తించిన సమస్యాత్మక గ్రామాలలో రాత్రి నిద్ర కూడా చేస్తున్నట్లు చెప్పారు. గొడవలు చేసేవారిని, రౌడీషీటర్లను గుర్తించి కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు, బైండోవర్ చేశామన్నారు. జిల్లా, రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులలో నిఘా ఉంచామని, జిల్లాలో 144 సెక్షన్ అమలు చేస్తున్నామని, పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా విజయవంతం చేయడానికి పోలీస్ యంత్రాంగం సిద్ధంగా ఉన్నామన్నారు. విసిలో రిటర్నింగ్ అధికారులు రంగస్వామి, మోహన్‌రావు, హరిప్రసాద్, రాఘవేంద్ర, లీలారాణి, నోడల్ అధికారులు, కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ సిబ్బంది పాల్గొన్నారు.



విసిలో పాల్గొన్న అభిషిక్త్ కిషోర్, ఎస్‌పి కృష్ణారావు

96 వస్తే.. 36 వేశారు..!


- 'పది' మూల్యాంకనంలో విద్యార్థికి అన్యాయం
- రీవాల్యుయేషన్‌తో వెలుగు చూసిన వాస్తవం
- 584 మార్కులతో మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థి తోసిఫా



రీవెరిఫికేషన్‌లో 96 మార్కుల జాబితా, తొలుత 36 మార్కుల జాబితా

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

పదవ తరగతి ప్రతి విద్యార్థికి ఎంతో ముఖ్యమైనది. అందులో వచ్చే మార్కులు ఆ విద్యార్థి భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుంది. మండలంలోనే ఉత్తమ విద్యార్థికి అధికారులు చేసిన తప్పిదం వల్ల టాపర్‌గా నిలిచే అవకాశం లేకుండా చేసింది. ప్రతి సబ్జెక్టులోనూ ఆ విద్యార్థికి 98, 97 మార్కులు వచ్చాయి. ఓ అధికారి చేసిన తప్పిదం వల్ల సోషియల్ సబ్జెక్టులో 36 మార్కులు మాత్రమే వేశారు. తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు రీవెరిఫికేషన్ కోరుతూ పదవ తరగతి బోర్డును ఆశ్రయించారు. రీవెరిఫికేషన్ చేయించగా ఆ విద్యార్థికి 36 మార్కులు కాకుండా 96 మార్కులు వచ్చాయని తేల్చారు. ఈ ఘటన విద్యా శాఖ అనుసరిస్తున్న నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లె రెడ్డివారిపల్లె ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ కె.సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు... బోడిమల్లవారిపల్లె తోసిఫా ఆదర్శ పాఠశాలలో పదవ తరగతి చదివారు. ఈ ఏడాది ఏప్రిల్ లో వెలువడిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో తాసిఫాకు అన్ని సబ్జెక్టులలో సరాసరిగా 98, 97 మార్కులు వచ్చాయి. పరీక్షలు మూల్యాంకనం చేసిన ఓ ఉపాధ్యాయుని తప్పిదంతో సోషియల్ సబ్జెక్టులో కేవలం 36 మార్కులు మాత్రమే వేశారు. పాఠశాలలో బాగా చదువుతూ అన్ని సబ్జెక్టులలో 95 మార్కులకు పైగా సాధించి, సోషల్ సబ్జెక్టులో తక్కువ మార్కులు రావడంతో ఒక్కసారిగా విద్యార్థితో పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం కూడా ఆశ్చర్యానికి గురైంది. విద్యార్థినిని సముదాయించి, ధైర్యం చెప్పి, రీవాల్యుయేషన్ కోసం పాఠశాల విద్యాశాఖ బోర్డుకు దరఖాస్తు చేశారు. మంగళవారం వెలువడిన రీవాల్యుయేషన్ ఫలితాలలో విద్యార్థిని తాసిఫాకు సోషియల్ సబ్జెక్టులో 100 మార్కులకు గాను 96 మార్కులు వచ్చాయి. 584/600 మార్కులతో మండల స్థాయిలో టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ కె.సత్యనారాయణ, ఉపాధ్యాయ బృందం విద్యార్థినిని ప్రత్యేకంగా అభినందించారు.





సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి రామచంద్రరావు

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి-పీలేరు

ఎన్నికల కమిషన్ ఆదేశాలను ప్రతి ఒక్క రాజకీయ పార్టీ నాయకుడు, కార్యకర్తలు, ఏజెంట్లు విధిగా పాటించాలని, వాటిని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని రాయచోటి డిఎస్‌పి రామచంద్రరావు, స్పెషల్ డిఎస్‌పి మోహన్‌రావు హెచ్చరించారు. బుధవారం పీలేరు పోలీసుస్టేషన్ ఆవరణంలో ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు, వారి ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సంబంధించిన ఓట్ల లెక్కింపు కార్యక్రమం జూన్ 4న రాయచోటిలోని సాయి ఇంజినీరింగ్ కళాశాలలో జరగనుందన్నారు. అక్కడికి అభ్యర్థులు, ఐడి కార్డు కలిగిన కౌంటింగ్ ఏజంట్లను తప్ప మరెవ్వరినీ అనుమతించేది లేదని తెలియజేశారు. జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 144 సెక్షన్, సిఆర్‌పిసి, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున, సాధారణ పౌరులకు అనుమతిలేదని పేర్కొన్నారు. నలుగు ఒక చోట ఉండడం, గుంపులుగా చేరడం లాంటివి చట్ట విరుద్ధమని చెప్పారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు నడుమ ఓట్ల లెక్కింపు జరుగుతుందని అన్నారు. అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు తమ వాహనాలను అనుమతించిన ప్రదేశాల్లో మాత్రమే పార్కింగ్ చేసుకోవాలని, అనవసరంగా ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేస్తే వాహనాలను పోలీస్ స్టేషన్ తరలిస్తామని హెచ్చరించారు. జూన్ 4న ఫలితాలు వెలువడిన తర్వాత పోలీస్ వారి అనుమతులు లేకుండా విజయోత్సవ ర్యాలీలు, బాణాసంచా తయారు చేయడం, విక్రయించడం, కాల్చడం లాంటి శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే శిక్షార్హులవుతారని మరోసారి హెచ్చరించారు. లాడ్జీల్లో బస చేయడం, మధ్యపానం సేవించడం, విందులు, వినోదాలకు అనుమతులు లేవన్నారు. గెలిచిన అభ్యర్థులు విందులు, వినోదాలు ఏర్పాటు చేయడం, ఓడిన అభ్యర్థి వర్గానికి చెందిన వారినుద్దేశించి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం వంటి చర్యలు పాల్పడితే అలాంటి వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కల్పించకుండా పోలీసువారికి పూర్తిగా సహకరించాలని పలు పార్టీల నాయకులకు, కార్యకర్తలను సూచించారు. కార్యక్రమంలో పీలేరు అర్బన్ సిఐ మోహన్ రెడ్డి, కలకడ సిఐ శ్రీనివాసులు, కలికిరి సిఐ మోహన్, వాల్మీకిపురం సిఐ పులి శేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కిరణ్ కిశోర్‌కు వైవీయూ డాక్టరేట్

ప్రజాశక్తి- కడప అర్బన్ : యోగివేమన విశ్వవిద్యాలయం జంతు శాస్త్ర విభాగ పరిశోధక విద్యార్థి మూరతోటి కిరణ్ కిశోర్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి తెలిపారు. జంతుశాస్త్ర విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.టి. వెంకట్రమణా రెడ్డి పర్యవేక్షణలో 'కాంప్రెహెన్సివ్ స్టడీ ఆఫ్ ద ఇంపాక్ట్ ఆఫ్ కాడ్మియం టాక్సిసిటి ఆన్ ఫిష్, లెబియో రోహిట' అనే అంశంపై పరిశోధన చేసి సమర్పించిన సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ ప్రదానం చేస్తూ ఆచార్య ఎన్. ఈశ్వర రెడ్డి నోటిఫికేషన్ జారీ చేశారు. వైవీయూ విసి ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై. పి. వెంకట సుబ్బయ్య, ప్రిన్సిపల్ ఆచార్య యస్. రఘునాథ రెడ్డి కిరణ్ కిశోర్ ను, గైడ్ డాక్టర్ ఎ.టి. వెంకట్రమణారెడ్డి ని అభినందించారు.

టిబి నివారణకు బిసిజి వ్యాక్సినేషన్ : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-రాయచోటి

టిబి నివారణే లక్ష్యంగా జిల్లాలో అన్ని సచివాలయాల్లో ప్రతి గురువారం బిసిజి వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య పేర్కొన్నారు. టిబి నివారణకు బిసిజి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఈ నెల 30న జిల్లాలో బిసిజి వాక్సినేషన్ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ భారతదేశంలో బిసిజి టీకా వల్లనే దేశంలో చాలా వరకు క్షయ నుంచి రక్షణ లభిస్తోందన్నారు. జిల్లాలో అవసరమైన వారం దరికీ వేసి టిబి లేని సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలో 2025 నాటికి టిబి నివారణే లక్ష్యంగా రెండు వారాలలో 21,404 వ్యాక్సినేషన్లను వేశామన్నారు. జిల్లాలో 473,742 వ్యాక్సిన్లు వేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లుగా తెలిపారు. ఐదేళ్ల కాలంలో క్షయ వ్యాధితో బాధపడుతూ మందులు వాడి టిబి వ్యాధి నయమైన వారికి, క్షయ వ్యాధిగ్రస్థుల కుటుంబ సభ్యులకు, మధుమేహం, ధూమపానం సేవించే వారికి, 60 ఏళ్లు పైబడిన వారికి, 18 ఏళ్ల వయస్సు పైబడి, బాడీ మాస్ ఇండెక్స్ 18 కంటే తక్కువ కల వారికి బిసిజి టీకాను జిల్లాలోని అన్ని సచివాలయంలలో ప్రతి గురువారం 3 నెలలు పాటు ప్రత్యేక శిక్షణ పొందిన ఆరోగ్య సిబ్బంది ద్వారా టీకా పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. అంగన్వాడీ సిబ్బందిని, టిబి ఛాంపియన్లను సమన్వయపరచుకొని టీకా ప్రాముఖ్యతను ప్రజలకు తెలియచేస్తారన్నారు. అదనపు డిఎంహెచ్‌ఒ డాక్టర్ శైలజ మాట్లాడుతూ బిసిజి టీకా పంపిణీ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ఎంపికైనందున మన జిల్లాలో ప్రతి గురువారం బిసిజి టీకా పంపిణీ చేయడానికి జిల్లా ఉన్నతాధికారులు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారుల సహాయ సహకారాలతో అన్ని సచివాల యాలలో ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. టీకా కార్యక్రమం జరిగే చోట్ల ఆరోగ్య సిబ్బంది ముందుగానే అక్కడి ప్రజలకు వాక్సిన్ ప్రాముఖ్యతను తెలపాలన్నారు.

'నందూరి' సాహిత్యంలో కొత్త అందాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

నండూరి సుబ్బారావు ఎంకి పాటలు తెలుగు సాహిత్యంలో ప్రణయ బావుకతకు,పదాల పొందికకు కొత్త అందాలు చేకూర్చాయని, ప్రతి పాటలో శృంగార మాధుర్యం తొణికిసలాడుతుందని వైఎస్‌ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. నండూరి 67వ వర్ధంతిని పురస్కరించుకుని వైఎస్‌ఆర్ జిల్లా రచయితల సంఘం బుధవారం కడప రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో నండూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంకి పాటల్లో మాండలిక పదాల సొంపు, పొందిక తెలుగు నేలకు పరిచయమేనని, పల్లెపడచు పూలతో కొప్పు చుట్టి, రూపాయ బిళ్ళంతబొట్టు పెట్టి, గోచి చీర గట్టి వయ్యారంగా నడుస్తుంటే మనవాళ్లు ఎంకిలా ఉందని వర్ణించడం పరిపాటేనని అని చెప్పారు. ఎంకి నాయుడు బావల ప్రణయ సన్నివేశాలను నండూరి నవరసాలతో మహాద్భుతంగా రచించారని పేర్కొన్నారు. తెలుగింటి ఆడపడుచులకు మరో పేరు ఎంకి అని కొనియాడారు. కవి వెల్లాల వెంకటేశ్వరాచారి మాట్లాడుతూ 1926లో ప్రచురితమైన ఎంకి పాటలు పెద్ద దుమారం లేపాయని, ఎంకి పాటలు చదివితే ఎవరైనా కూని రాగాలు తీయాల్సిందేనన్నారు. విశ్వనాథ లాంటివారే ఆ పాటల మోజులో పడ్డారంటే మనం అర్థం చేసుకోవచ్చున్నారు. కార్యక్రమంలో గంగయ్య, బాల ఓబయ్య, తపలిస్టు గంగయ్య, జ్యోతి జార్జి, కొండయ్య పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి : డిఇఒ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మధ్యాహ్న భోజనం వంట చేసే వారు విద్యార్థులకు చాలా రుచిగా వంటలు చేయాలని అన్నమయ్య జిల్లా డిఇఒ యు.శివ ప్రకాష్‌రెడ్డి కోరారు. బుధవారం పట్టణంలోని ఉర్దూ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన మండల స్థాయి వంటకాల శిక్షణ కార్యక్రమం, వంటల పోటీలు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని ప్రసంగించారు. మనసుపెట్టి వండితే రుచిగా వస్తుందని తెలిపారు. వంట చేసే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వంట చేసే ప్రాంతాలలో ఈగలు, దోమలు రాకుండా శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. మధ్యాహ్న భోజనం బిల్లులు ప్రతి నెల సక్రమంగా వస్తున్నాయని తెలిపారు. కుళ్ళిన కోడిగుడ్లు వాడరాదని, పరిశుభ్రమైన నీటిని వాడాలని తెలిపారు. రాగి జావ తాగడం వలన పిల్లలు ఉత్సాహంగా ఉంటారని, వాటిలో చాలా పోషకాలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం పోషకాలు, విటమిన్లు, మాంసపు కృత్తులు, మినరల్స్, ఫ్యాట్ తదితర పోషక పదార్థాలు ఉన్న మెనూ రూపొందించిందని తెలిపారు. పిల్లలు బరువు తక్కువ, రక్తహీనత, వయస్సు తగ్గట్టు ఎత్తు పెరగడం లేదని గ్రహించి ప్రభుత్వం పౌష్టిక ఆహారం పిల్లలకు అందించే ఉద్దేశంతో కోడిగుడ్లు, రాగి జావ, చెక్కి తదితర శక్తినిచ్చే ఆహారాన్ని మధ్యాహ్న భోజనంలో ప్రవేశపెట్టిందని ఆయన వివరించారు. మధ్యాహ్న భోజనంలో ఫోర్టీ రైడ్ రైస్ ఇస్తున్నారని, ఈ బియ్యంలో అనేక పోషకాలు ఉన్నాయని తెలిపారు. తాజా ఆకుకూరలు, కూరగాయలు వాడాలని, మంచి బ్రాండెడ్ నూనెలు వాడాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి 100 శాతం విద్యార్థులు పాఠశాలలోనే భోజనం చేయాలని, ఆ విధంగా వంటలు చాలా రుచిగా చేయాలని కోరారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు వంట పాత్రలుగా ఎప్పటికప్పుడు శుభ్రపరచి ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రాజంపేట మండల విద్యాధికారి దాసరి సుబ్బరాయుడు, నందలూరు ఎంఇఒ నాగయ్య, పుల్లంపేట ఎంఇఒ చక్రధర్ రాజు, కో-ఆర్డినేటర్ జిలాని బాష, మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకులు ముజఫర్ అహ్మద్, రాజగోపాల్ నాయుడు, పి.సుబ్బలక్ష్మి, ఎ.నారాయణమ్మ పాల్గొన్నారు. అనంతరం వంటల పోటీలలో గెలుపొందిన మన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వంట మాస్టర్ పి.లక్ష్మీదేవి, బాలిరెడ్డిగారిపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన కె.స్వాతి, రాజంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల వై.మల్లేశ్వరిలకు బహుమతులు అందజేశారు.



బహుమతులు అందజేస్తున్న డిఇఒ శివ ప్రకాష్‌రెడ్డి

కర్నూలుపై నెల్లూరు జట్టు విజయం

ప్రజాశక్తి-కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎసిఎ సౌత్ జోన్ సీనియర్ మేన్స్ వన్డే క్రికెట్ టోర్నీలో భాగంగా బుధవారం కెఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కర్నూలు జట్టుపై 8 వికెట్ల తేడాతో నెల్లూరు జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 42.5 ఓవర్లలో 161 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని యుఎంఎస్.గిరినాథ్ 44 పరుగులు చేశాడు. నెల్లూరు జట్టుకు చెందిన ఎస్.కె.అతిక్ సల్మాన్ 4 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 162 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 21.5 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 165 పరుగులు సాధించి 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని కె.రేవంత్‌రెడ్డి 81, నిఖిలేష్ 61(నాటౌట్) పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని అంజి 2 వికెట్లు తీసుకున్నాడు.

63 పరుగుల తేడాతో కడప జట్టు విజయం

కడపలోని కెఒఆర్‌ఎం మైదానంలో బుధవారం జరిగిన ఎసిఎ సౌత్ జోన్ సీనియర్ మెన్స్ వన్డే క్రికెట్ మ్యాచ్ లో చిత్తూరు జట్టుపై 63 పరుగుల తేడాతో కడప విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 310 పరుగులు చేసింది. ఆ జట్టులోని టి. వంశీకృష్ణ 83, షేక్ జహీర్ అబ్బాస్ 50 (నాటౌట్) పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని దీపన్ సాయినాథ్ 3 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 311 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన చిత్తూరు జట్టు 46.3 ఓవర్లలో 247 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని వై.తేజారెడ్డి 5 పరుగులు చేశాడు. కడప జట్టులోని ఎస్ ఎం డి అస్లాం 4, ఎస్. మొహమ్మద్ రఫీ 3 వికెట్లు తీసుకున్నాడు.

అనంతపురంలోనూ కడప జట్టు విజయం

అనంతపురంలో బుధవారం జరిగిన ఎసిఎ సౌత్ జోన్ అండర్- 19 మెన్ వన్డేస్ అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంటులో మ్యాచ్‌లో చిత్తూరు జట్టుపై 5 వికెట్ల తేడాతో కడప జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 40.5 ఓవర్లలో 112 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని చరణ్జిత్ 48 పరుగులు చేశాడు. కడప జట్టులోని ఏ. శ్రీ సాయి చరణ్ రెడ్డి అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 4 వికెట్లు తీసుకున్నాడు. మరో బౌలర్ బి. ప్రణవ్ రెడ్డి 2 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 113 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింం కు దిగిన కడప జట్టు 24.0 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 115 పరుగులు చేసి 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని టి. సుదర్శన్ 25 (నాటౌట్) పరుగులు చేశాడు.



తలపడుతున్న కర్నూలు, నెల్లూరు జట్లు


రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎడిఎ, ఎఒ

వేరుశనగ విత్తనకాయలు సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ప్రభుత్వం సబ్సిడీ ధరపై అందిస్తున్న వేరుశనగ విత్తన కాయలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ మదనపల్లి ఎడిఎ దీప్తికుమారి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలో జరుగుతున్న వేరుశనగ విత్తన కాయల పంపిణీ కార్యక్రమాన్ని మండల వ్యవసాయ శాఖాధికారి మురళీమోహన్ తో కలిసి తనిఖీ చేశారు. రాచవేటివారి పల్లె, రెడ్డివారిపల్లె, తవళం రైతు భరోసా కేంద్రాలలో జరుగుతున్న పంపిణీ కార్యక్రమాలను పరిశీలించారు. రైతు భరోసా కేంద్రాలలో పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో వర్షాభావ ఆధారంగా రైతులు వేరుశనగ పంటను సాగు చేస్తున్నారని అన్నారు. వేరుశనగ విత్తనాలను ప్రభుత్వం 40 శాతం సబ్సిడీపై అందిస్తున్నారని తెలిపారు. విత్తనాలు తీసుకున్న రైతులు ప్రతి ఒక్కరూ వేరుశనగ పంటను సాగు చేసి సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. వేరుశనగ విత్తనాలు తీసుకున్న రైతులు 3-6 (రెడ్డి రకం) విత్తనాలు నాసిరకంగా ఉన్నాయని అన్నారు. విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఎఇఒ లక్ష్మీ ప్రసన్న, సహాయకులు వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు. **గాలివీడు :** రైతులు వేరుశనగ విత్తనకాయలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మండెం మురళీధర్ పేర్కొన్నారు. నూలివీడు తలముడిపి కొర్లకుంట గ్రామాలలోని రైతుభరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. మండలానికి 2075 క్వింటాళ్ల కే సిక్స్ విత్తన కాయలు 30 కేజీల రూ.1710లు, 400 క్వింటాళ్ల నారాయణి 30 కేజీల బస్తా రూ.1746లు నగదును రైతు భరోసా కేంద్రాల్లో చెల్లించి విత్తనకాయలు తీసుకొని పోవాలని రైతులకు పేర్కొన్నారు. ఇప్పటికే రైతులు పొలాన్ని సాగు చేసి పంటే సిద్ధం చేసుకున్నారని వర్షం వచ్చిన వెంటనే వేరుశనగ విత్తనాలు విత్తడానికి రైతులు సంసిద్ధంగా ఉన్నారని అన్నారు. ప్రభుత్వం కూడా ముందుగానే రైతులకు విత్తనాలు అందివ్వడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

రేపు శ్రీసాయి డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

పట్టణంలోని శ్రీసాయి డిగ్రీ కళాశాలలో ఈ నెల 31వ తేదీన ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ముత్యాల పెంచలయ్య తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆసెంచర్ రిక్రూట్మెంట్ టెక్నాలజీ, నాన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగాల్లో పలు బహుళ జాతీయ కంపెనీలు ఉద్యోగమేళాలో అభ్యర్థులను ఇంటర్వ్యూ చేయనున్నట్లు తెలిపారు. నిరుద్యోగులు అవకాశాన్ని ఉపయోగించు కోవాలని కోరారు.

తాగునీటి బోరుకు మరమ్మతులు

ప్రజాశక్తి-కలికిరి


తాగునీటి బోరుకు మరమ్మతులు చేయిస్తున్న రెడ్డిరామ్

స్థానిక మండలంలోని మర్రికుంటపల్లి గ్రామ పంచాయతీలో తాగునీటి బోర్లకు మరమ్మతులు చేసినట్లు సర్పంచ్ రెడ్డిరామ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని కడియాల వాండ్లపల్లిలో మంచినీరు బోరు మరమ్మతుకు రావడంతో వెంటనే మరమ్మత్తులు చేయించి తాగు నీటి సమస్య తీర్చామని అన్నారు. వీరపల్లి వాండ్లపల్లెలో మోటార్ మరమ్మత్తుకు గురి కావడంతో అక్కడ నూతన మోటర్ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామంలో ఎక్కడ మంచి నీటి సమస్య రాకుండా వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామ ప్రజల సమస్య బాధ్య తగా తీసుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గాయత్రి పాల్గొన్నారు.

బిసిజి టీకాతో టిబి దూరం

ప్రజాశక్తి-నందలూరు



నందలూరు:మాట్లాడుతున్న డాక్టర్ శరత్

బిసిజి టీకా తోనే టిబి వ్యాధిని దూరం చేయవచ్చని మండల ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ కె.శరత్, కమల్, డాక్టర్ విశ్వనాధ్లు తెలిపారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే నిర్వహించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో 60 సంవత్సరాలు నిండిన అందరికీ, 18 సంవత్సరాల వయసు నిండి 60 సంవత్సరాల వయసులోపు ఉండిన వారికి, ఐదేళ్ల కింద టిబి వ్యాధి వచ్చి తగ్గిన వారికి, షుగర్ వ్యాధిగ్రస్తులకు, పొగ త్రాగుతూ చాలించిన వారికి, ఇప్పుడు పొగ తాగేవారికి, టీబి వ్యాధిగ్రస్తులతో ఎక్కువ సంబంధాలు ఉన్నవారికి, బాడీ మాస్ ఇండెక్స్ 18 కంటే తక్కువ ఉన్నవారికి టీకా వేయనున్నట్లు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని గ్రామాలలో ప్రతి గురువారం బిసిజి టీకా కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. బిసిజి టీకా గురించి మీకు దగ్గరలోని ఉపకేంద్రంలో ఆశా కార్యకర్తలను, ఆరోగ్య కార్యకర్తలను, ఎంఎల్ హెచ్పిలను సంప్రదించాలని కోరారు. **పీలేరు:** 2025 సంవత్సరానికి క్షయ వ్యాధి నిర్మూలన లక్ష్యంగా చేపట్టిన వయోచనలు బిసిజి టీకా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీలేరు టిబి యూనిట్ అధికారి డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. బుధవారం ఆయన తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పీలేరు మోడల్ కాలనీలో వయోజనులకు బిసిజి టీకాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 16 నుండి బిసిజి టీకా పంపిణీ కార్యక్రమం ప్రారంభించడం జరిగిందని, తమ వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి సర్వే చేసి వివరాలు సేకరించడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు టీకా తీసుకోవడానికి అందరే సమ్మతించారని, వీరికి యాక్షన్ప్లాన్ ప్రకారం మండలంలోని ప్రతి సచివాలయంలో గురువారం సెషన్లో టీకాను ఆరోగ్య సిబ్బంది ద్వారా అందివ్వడం జరుగుతుందని తెలిపారు. మాములుగా ఈ టీకాను బిడ్డ పురుడు పోసుకున్న రోజునే టిబి వ్యాధి రాకుండా ఇస్తున్నామని, ఈ కార్యక్రమంలో 60 సంవత్సరాలు పైబడిన వారు, మధుమేహగ్రస్థులు, ధూమపానం చేసే వారు, 18 సంవత్సరాలు పైబడిన టీబీ వ్యాధిగ్రాస్థుల కుటుంబ సభ్యులు, పాత టిబి వ్యాధి గ్రాస్తులు, బాడీ మోస్ ఇండెక్స్ 18 కంటే తక్కువ ఉన్నవారు, మొదలైన వారికీ క్షయ వ్యాధి రాకుండా ఈ టీకా ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని చెప్పారు.ఈ టీకాను 18సంవత్సరాలలోపు వయస్సు వారు, దీర్ఘ కాలికి వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, పాలు ఇచ్చే తల్లులు, కేన్సర్, హెచ్ఐవి భాదితులు తీసుకోరాదని తెలిపారు.. ఈ విషయాన్ని ఆరోగ్య సిబ్బంది కూడా గుర్తుంచు కోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టిబి సుపర్వైజర్లు మోహన్, ఎస్టిఎల్ఎస్ మునీశ్వరయ్య, ఆరోగ్య కార్యకర్త లక్ష్మి, సిహెచ్ఒ రాజ్యలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


పీలేరు: వయోవృద్ధులకు టీకాపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం

- అర్హులైన రైతులకు ఉపయుక్తం

ప్రజాశక్తి-వీరబల్లి

రైతులను పండ్ల తోటల పెంపకం వైపు మళ్లించి ప్రోత్సహించేందుకు డ్వామా చర్యలు చేపట్టింది.మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మెట్ట భూముల్లో ఉద్యాన పంటల సాగుకు ప్రాధాన్యం ఇస్తోంది. ఆసక్తి చూపే రైతులకు పంట రకాన్ని బట్టి మొక్కల కొనుగోలు, గుంతలు తీసింది మొదలు పంట దిగుబడి వరకు వివిధ దశల్లో అయ్యే ఖర్చును మూడు నుంచి రెండేళ్లపాటు భరించ నుంది. ఐదు ఎకరాల లోపు నీటి వసతి ఉన్న రైతులు, గతంలో లబ్ధి పొందని వారందరూ ఈ పథకానికి అర్హులు. సాధారణ పండ్ల తోటలతో పాటు గులాబీ, మల్లె, కొబ్బెరి, డ్రాగన్ ఫ్రూట్స్ వంటి 18 రకాల పండ్ల మొక్కలను పెంచేలా కార్యాచరణ రూపొందించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మండల వ్యాప్తంగా 300 ఎకరాలలో పండ్ల మొక్కలు, పూల మొక్కలు,నాటాల అన్నది లక్ష్యం. వర్షాకాలం ముగిసే లోపు లక్ష్యాలను పూర్తి చేసే దిశలా డ్వామా యంత్రాంగం కసరత్తు చేపట్టింది. ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు,పట్టాదారు పాసు పుస్తకం కలిగిన రైతులు, మండల కేంద్రంలోని ఉపాధి హామీ సంబంధించిన ఫీల్డ్ అసిస్టెంట్ లను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ఉపాధి హామీ పథకం ఎపిఒ నాగరాజ్ తెలిపారు.


పండ్ల మొక్కలను అందిస్తున్న ఎపిఒ

నిర్వహణ ఖర్చులు ఇలా

ఎకరా విస్తీర్ణంలో పంట సాగుకు మొక్కల కొనుగోలు,రవాణా ఖర్చులు, గుంతలు తీయడం, మొక్కలు నాటేందుకు అయ్యే కూలీల ఖర్చులు, ఇస్తారు. ఒక్కో మొక్కకు సంరక్షణకు రూ.4.25 చొప్పున 100 మొక్కలకు రూ. 425.ఇలా నెలలు నాలుగు విడుదల కలిపి మాస్టర్ల రూపంలో రూ. 1700 రైతుకు అదనంగా అందిస్తారు. పాదులు తీసి నీరు పెట్టడానికి మరో రూ. 3,500 ఇవ్వనున్నారు.ఇలా మొత్తం రూ. 5200 పొందవచ్చు అన్నారు. ఎరువులకు 6 నెలలకు ఒకసారి రూ. 3000 ఇస్తారు. నిర్వహణ ఖర్చుల కింద ఉపాధి పని దినాలను బట్టి మూడేళ్ల పాటు చెల్లిస్తుంది.

వర్షాకాలం అనుకూలం

వర్షాకాలంలో పండ్ల మొక్కల పెంపకానికి ఎంతో అనుకూలం.ఇప్పుడు నాటితే 100 శాతం మొక్కలు బతుకుతాయి. రైతుకు దాదాపు ఆరు నెలలు నీటిని అందించే శ్రమ ఉండదు.నాటిన ప్రతి మొక్క బతుకుతుంది. మెట్ట భూముల్లో పండ్ల మొక్కల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుంది.ఆసక్తి ఉన్న రైతులు మండల పరిధిలోని ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లను, ఉపాధి హామీ ఎపిఒను, సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చు.


ఉపాధి హామీ ఎపిఒ నాగరాజ

విభిన్న ప్రతిభావంతుల విద్యపై ప్రత్యేక దృష్టి


విభిన్నప్రతిభావంతుల పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఐఆర్టిలు

ప్రజాశక్తి-కలకడ

విభిన్న ప్రతిభావంతుల విద్య కొరకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతున్నట్లు ఎంఇఒలు మునేంద్రనాయక్, రామచంద్రారెడ్డిలు పేర్కొన్నారు. మండల కేంద్రమైన కలకడ పరిసర ప్రాంతాలలో విభిన్న ప్రతిభావంత పిల్లల కోసం బడిబాట కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల ఇంటికి పరిమితం కాకుండా వారిలో మానసికంగా శారీరకంగా అభివృద్ధిని తీసుకురావాలనే ఉద్దేశంతో డిఇఒ శివప్రకాష్రెడ్డి, ఐఇ కో-ఆర్డినేటర్ జనార్ధన్ ఆదేశాల మేరకు ప్రతి విభిన్న ప్రతిభావంత పిల్లలను బడిలో చేర్పించి ఎన్రోల్మెంట్ చేయుటకు ఐఆర్టిలు ఎం.లక్ష్మినరసమ్మ, సి.విశ్వనాథలు ఇంటింటి సర్వే చేపట్టారు. చదువుకు దూరంగా ఉన్న వారిని బడిలో చేరిన తర్వాత వారికి ప్రభుత్వం తరపున వచ్చే సంక్షేమ పథకాల రాయితీలు, సదుపాయాలు, అమలవుతున్న శిక్షణలు తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమం ఈనెల 1 నుంచి జూన్ 9వరకు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. మండలంలోని ప్రతి తల్లి దండ్రులకు విభిన్న ప్రతిభావంతుల గురించి సమాచారం ఐఇఆర్టి సిబ్బందికి తెలియజేసి ప్రతి ఒక్క విభిన్న ప్రతిభావంత బాలబాలికలు విద్యను అభ్యసించేందుకు సహకరించాలని తెలిపారు. ఇప్పటివరకు పాఠశాలలో ఎన్రోల్మెంట్ జరగని 20 మంది విభిన్నప్రతిభావంత పిల్లలను గుర్తించి వారిని త్వరలో పాఠశాల లో చేర్పించనున్నట్లు తెలిపారు. ప్రతి మండలం హెడ్ క్వార్టర్స్లో ఒక భవిత కేంద్రం ఉంటుందని భవిత కేంద్రం వలన కలిగే ప్రయోజనాలను కూడా తల్లిదండ్రులకు వివరించారు. దివ్యాంగ పిల్లలకు ఉచితంగా ఉపకరణాలు అందిస్తారని, ప్రతి నెల రూ.300చొప్పున రవాణా భత్యం, వీరితోపాటు వచ్చే వారికి ఎస్కార్ట్ అలివేషన్స్ క్రింద రూ.300లు చెల్లిస్తారని చెప్పారు. బాలికలకు ప్రతినెల ప్రత్యేకంగా రూ.200 అందించడం జరుగుతుందని అన్నారు. వినికిడి, దృష్టిలోపం ఉన్నవారికి ఉచితంగా ట్యాబ్లు పంపిణీ, వైకల్యం ఉన్న వారిలో సదరం సర్టిఫికెట్ పత్రం పంపిణీ, స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీపై శిక్షణ అందిస్తారని తెలిపారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు : డిఎస్పి


మదనపల్లి : డిఎస్పి ఆధ్వర్యంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-మదనపల్లి

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ రోజు మదనపల్లిలో గొడవలు అల్లర్లు జరగకుండా ప్రశాంత వాతావరణం నెలకొల్పడమే లక్ష్యమని మదనపల్లె డిఎస్పి ప్రసాద్ రెడ్డి తెలిపారు. అన్నమయ్య జిల్లా ఎస్పి బి.కృష్ణారావు ఆదేశాల మేరకు మదనపల్లె సిఐలు యువరాజు, శేఖర్, సద్గురుడు, వల్లిబాషాతో పాటు కేంద్ర పారా మిలిటరీ బలగాలతో బుధవారం పట్టణంలోని పురవీధుల్లో కవాతు నిర్వహించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ జూన్ 4న ఎన్నికల కౌంటింగ్కు ప్రజలందరూ సహకరించాలన్నారు. ఎన్నికల కోడ్,144 సెక్షన్ అమల్లో ఉందని చెప్పారు. ఎన్నికల నియమావళిని అనుసరించి పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మదనపల్లి సబ్ డివిజనల్ పోలీస్ అధికారులు మరియు బిఎస్ఎఫ్ కేంద్ర బలగాలతో మదనపల్లి పట్టణంలో చిత్తూరు బస్టాండు, నెహ్రూ బజారు, అప్పారావు తోట, బెంగళూరు బస్టాండు, మల్లికార్జున సర్కిల్, డాక్టర్ అని బిసెంట్ సర్కిల్ ఎన్టిఆర్ సర్కిల్, కదిరి రోడ్డు, మాయాబజార్, చౌడేశ్వరి దేవి ఆలయం వరకు కవాతు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో డిఎస్పితో పాటు సిఐలు జి.యువరాజు, నాగేంద్ర, టూ టౌన్ ఎస్ఐ వెంకటసుబ్బయ్య, ఎఎస్ఐ ఇమామ్ సాహెబ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కలకడ : కౌంటింగ్ రోజున అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కలకడ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు హెచ్చరించారు. బుధవారం సాయంత్రం కె.వి.పల్లి మండలం నూతన కాల్వలో వివిధ రాజకీయపార్టీల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికలను జూన్ 4న ఓట్ల లెక్కింపు ఉంటుందని ఆ రోజున ఎలాంటి ఘర్షణలు, అల్లర్లకు పాల్పడితే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.రాయచోటి డిఎస్పి ఆదేశాల మేరకు పీలేరు నియోజకవర్గంలోని గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ రోజున గెలిచినవారు బాణసంచా పేల్చడం, ఊరేగింపు చేయడం వంటివి చేస్తే వారిపై చర్యలు తీసు తీసుకోవడమే కాకుండా కేసును నమోదు చేస్తామని హెచ్చరించారు. ఒక పార్టీ వారు ఇంకొక పార్టీ వారిని దూషించడం, ఘర్షణలకు పాల్పడం వంటి దుశ్చర్యలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో కెవిపల్లి ఎస్ఐ రహీముల్లా, గ్రామస్తులు పాల్గొన్నారు.**కలికిరి :** శాంతి భద్రతలకు విగాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్.మోహన్ తెలిపారు.ఈ సందర్భంగా మండలంలో టిడిపి నాయకులకు నోటీసులు అందించారు. జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ నేపద్యంలో శాంతి భద్రతలకు విగాతం కలిగించరాదని అన్నారు.


కలకడ: సమావేశంలో మాట్లాడుతున్న సిఐ శ్రీనివాసులు

ఉత్కంఠ భరితంగా 'ఎన్సిఎల్' క్రికెట్ లీగ్


మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకుంటున్న అబ్దుల్లా

ప్రజాశక్తి-నందలూరు

నందలూరు ప్రీమియర్ లీగ్ 8వ సీజన్లో భాగంగా నాగిరెడ్డి పల్లె మేజర్ గ్రామపంచాయతీ అరవ పల్లెలోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న ఓపెన్టు ఆల్ హార్డ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్కంఠ భరితంగా కొనసాగుతోంది. బుధవారం ఉదయం జరిగిన మ్యాచ్లో క్రేజీ లెవన్స్ నందలూరు జట్టుపై వినాయక లెవెన్స్ నాగిరెడ్డిపల్లె జట్టు విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన వినాయకజట్టు 14 ఓవర్లలో ఏడు వికెట్లను కోల్పోయి 152 పరుగులకు చేసింది. వినాయక జట్టు ఆటగాడు అబ్దుల్లా 9 సిక్సర్లు 4 ఫోర్లతో 46 బంతుల్లో 91 పరుగులు చేశాడు. అనంతరం విజయం కోసం బరిలో నందలూరు జట్టు 14 ఓవర్లలో 7 వికెట్లను కోల్పోయి 142 పరుగులు చేసి పరాజయం చెందింది. వినాయక జట్టు బ్యాట్స్మెన్ అబ్దుల్లా 91 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించి సీనియర్ క్రికెట్ క్రీడాకారుడు పత్తి శంకర, కిరణ్లచేతుల మీదుగా మ్యాన్ఆఫ్ది మ్యాచ్ ట్రోఫీని అందుకున్నారు.

పాటూరుపై మునక్కాయలపల్లి విజయం


మధ్యాహ్నం పాటూరు, మునక్కాయలపల్లి జట్ల మధ్య మ్యాచ్ జట్ల మధ్య మ్యాచ్ రసవత్తరంగా కొనసాగింది. మొదట బ్యాటింగ్ చేసిన మునక్కాయలపల్లె జట్టు 14 ఓవర్లలో 164 పరుగులకు 7 వికెట్లను కోల్పోయింది. హరి 43, కార్తీక్ 38, ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ 31 పరుగులు చేశారు. అనంతరం 165 పరుగుల విజయ లక్ష్యంతో బరిలో దిగిన పాటూరు జట్టు 14 ఓవర్లలో 141 పరుగులు చేసి అన్ని వికెట్లను కోల్పోయి పరాజయం చెందింది. రెండు ఓవర్లు వేసి 2 వికెట్లు తీయడంతోపాటు 38 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన కార్తీక్ కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ను అందజేశారు. ఈ మ్యాచ్ కు జాతీయ వికలాంగ క్రికెట్ క్రీడాకారుడు శివకోటి, సీనియర్ క్రికెట్ క్రీడాకారుడు మున్న అంపేర్లుగా, అప్సర్, దినేష్ లు స్కోరర్ గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్స్ పల్లె గ్రీష్మంత్ రెడ్డి, ముమ్మడిశెట్టి సుధాకర్, రంజిత్, క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్లో శంకర్కు చోటు

ప్రజాశక్తి-నందలూరు

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్లో నందలూరుకు చెందిన డాక్టర్ పసుపులేటి శంకర్ పేరు నమోదు చేశామని హైదరాబాద్కు చెందిన కళానిలయం సాంస్కృతిక సేవా విభాగం ప్రతినిధులు పేర్కొన్నారు. భారత రత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా 30న హైదరాబాద్లోని చిక్కడపల్లి శ్రీ త్యాగరాయగాన సభలో కార్యక్రమము ఉంటుందని అన్నారు. డాక్టర్ శంకర్ పాఠశాల, కళాశాల విద్యార్థులకు మానసిక ఒత్తిడి నివారణ, వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యం, జాతీయ సమైక్యతలతో పాటు ధార్మిక ఉపన్యాసాలు ఉచితంగా ఇస్తుంటారు. శంకరకు ఇటీవల ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ వారు దైవిక విభాగంలో గౌరవ డాక్టరేట్ ఇచ్చినట్లు తెలిపారు. ఒంటిమిట్ట పోతన సాహిత్య పీఠం అధ్యక్షులుగా వైఎస్ఆర్ జిల్లా ధార్మిక సంస్థల పరిరక్షణ సమితి అధ్యక్షుడిగా కడప రాజరాజేశ్వరి బిపిఆర్ భవద్గీత సత్సంగం గౌరవ అధ్యక్షులుగా వున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫస్ట్ బెస్ట్ జర్నలిస్ట్ అవార్డు, న్యూఢిల్లీ లో స్వర్ణ నంది అవార్డు, దేశంలోని 8 సంస్కృత విశ్వావిద్యాలయాల ఛాన్సెలర్లు, తిరుపతిలో సనాతన ధర్మ సారధి బిరుదు ఇచ్చారని తెలిపారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్లో తనకు చోటు దక్కడం చాలా సంతోషంగా ఉందని పసుపులేటి శంకర్ పేర్కొన్నారు.


పసుపులేటి శంకర్


మాట్లాడుతున్న అమీర్

ఎన్నికల ఫలితాల్లో ఇండియా వేదికదే విజయం

ప్రజాశక్తి-గుర్రంకొండ

ఎన్నికల్లో ఫలితాల్లో కేంద్రంలో ఇండియావేదికదే విజయమని అన్నమయ్య డిసిసి చీఫ్ సెక్రటరీ అమీర్ అన్నారు. బుధవారం గుర్రంకొండలో ఏర్పాటుచేసిన విలేకకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంతవరకు జరిగిన ఐదు విడుతల సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా వేదిక వైపే దేశ ప్రజలు మొగ్గు చూపారని అన్నారు. ఒకటో తేదీ జరిగే చివరి విడతలో కూడా ప్రజలు కూటమి వైపే మొగ్గుచూపుతారని, అన్ని సర్వేలు కూడా ఇదే చెబుతున్నాయని చెప్పారు. అబద్ధాలను అభివృద్ధిగా చెప్పుకుంటూ నరేంద్ర మోడీ కొనసాగించిన వంచన పాలనను ప్రజలు చరమగీతం పాడుతారని అన్నారు. రాహుల్గాంధీని ఈ దేశానికి ప్రధానిగా చూడాలన్న దేశ ప్రజల కోరిక తప్పక నెరవేరుతుందని అన్నారు. ఎన్ని కష్టనష్టాలు వచ్చినా కాంగ్రెస్ పార్టీ కోసం నిజాయితీగా జెండా మోసిన ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్తకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గుర్రంకొండ మండల అధ్యక్షులు సమీరుద్దీన్, ఖాదర్బాషా, అమానుల్లా ఖాన్, అర్షద్ అలీ, మహమ్మద్ షానవాజ్, మహమ్మద్ సమీద్ పాల్గొన్నారు.



చిన్నపిల్లలకు వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు

చిన్నపిల్లల ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక గేటు వద్ద బుధవారం చిన్నపిల్లల ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని ఆయుష్ ఆసుపత్రి వైద్యాధికారి ఎం.మహేష్నాయక్ పేర్కొన్నారు. చిన్నపిల్లల్లో చిన్న చిన్న జబ్బులు, బలహీ నతపై అనేకమంది బాధపడుతుంటారని వారి కోసం వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి పిల్లలను పరీక్షించి మందులు, టానిక్లు పంపిణీ చేశామని తెలిపారు. బుధవారం కూరగాయల సంత కావడంతో చుట్టుపక్క మండలాల నుంచి గ్రామాల నుంచి ప్రజలు సంతకు వచ్చి సంతలో ఉన్న తల్లిదండ్రులు వాళ్ళ పిల్లలని తీసుకుని వచ్చి ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినోదం చేసుకున్నారని అన్నారు. 120 మంది చిన్నారులకు ఉచిత వైద్య శిబిరం ద్వారా వైద్యం చేసి వారి ఉచిత మందులు పంపిణీ చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పవన్కుమార్, పవన్కల్యాణ్, సోమశేఖర్, లక్ష్మీప్రసన్న, స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.


పొలంలో తనిఖీలు చేస్తున్న కేంద్రబలగాలు

శ్రీనివాసపురంలో నాకాబందీ

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల పరిధిలోని శ్రీనివాసపురంలో కేంద్ర బలగాలతో కలిసి నాకాబందీనిర్వహించినట్లు ఎస్ఐ రమేష్బాబు ఆధ్వర్యంలో నాకాబందీ నిర్వహించారు. ప్రతి ఇంటిని, వీధులను,పొలాలను క్షుణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ఉన్నందున ఎటువంటి అల్లర్లకు పాల్పడకుండా గ్రామాల్లో ప్రజలంతా శాంతి యుతంగా ఉండాలన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందుకు నలుగురుకు మించి ఎక్కడా గుంపులుగా ఉండకూడదని అన్నారు. విజయోత్సవర్యాలీలు, బాణసంచా పేల్చడం నిషేదమని అన్నారు. ఎన్నికల ఫలితాలను ఇళ్లలోని టివిల ద్వారా వీక్షించాలని సూచించారు.రోడ్లపైకివచ్చి ఇష్టానుసారంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్రైం కార్నర్

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

ప్రజాశక్తి-గాలివీడు


పోలీసులు సీజ్చేసిన ట్రాక్టర్లు

ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని డ్రైవర్ను అరెస్టు చేసి నట్లు ఎస్ఐ వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. అక్రమ ఇసుక రవాణా చేసే వారిపైన చర్యలు తీసుకుంటామని అన్నా రు. అధికారుల అనుమతి లేకుండా చెరువులు, కాలువలు, నదులలో అక్రమంగా ఇసుక రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. **రామాపురంలో..** అక్రమంగా రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్ను రాయచోటి ఎస్ఐ, ఎల్ఆర్పల్లి ఎస్సిబి సిబ్బంది కలసి అదుపులకు తీసుకొని రామాపురం పోలీస్ స్టేషన్కు అప్పగించారు. మండలంలోని జాతీయ రహదారి ఆదర్శ పాఠశాల వద్ద అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ వెంకటేశును అదుపులోకి తీసుకున్నారని ఎస్ఐ లక్ష్మీప్రసాద్ తెలిపారు. కేసునమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి-చిన్నమండెం


షహీనా(ఫైల్ ఫొటో)

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం చెందిన సంఘటన మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని స్థానిక వైఎస్ఆర్ కాలనీలో నివాసమున్న షేక్ షహీనా అనే మహిళ స్కూటీలో తన కుమార్తెతో కలిసి సద్దలగుట్టపల్లిపల్లెలోని వలిమాకు హాజరైందని తెలిపారు. వలీమా నుంచి తిరిగి చిన్నమండెంకు వస్తుండగా కేసాపురం గ్రామం, రెడ్డివారి పల్లె క్రాస్ వద్ద కర్ణాటక చెందిన బొలెరో వాహనం వెనుక వైపు నుంచి స్కూటీని ఢీకొట్టినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో కింద పడిన మహిళ తలకు బలమైన గాయమై మృతి చెందిందని తెలిపారు. బొలెరో వాహనం డ్రైవర్ అజాగ్రత్తగా నడపడం వలన ఈ ప్రమాదం జరిగిందని మృతురాలి కుమార్తె షేక్ షబీన్తాజ్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.